


టేబిల్ నిండా ఫోల్డర్లు....

గంటనుంచి వాటన్నిటినీ చదివిన ప్రకాశ రావు నెమ్మదిగా వాటిని మడిచి తొందరగా పెట్టి కుర్చీలో జేరబడి ఆలోచించడం మొదలు పెట్టాడు. స్టీలుషీట్ల లైసెన్సు వొచ్చి వారం రోజులుపైగా ఐంది. డైరెక్టరు తనదగ్గర పెట్టుకుని ఇవాళ గంట కిందట తన చేతికిచ్చి, "చూడండి మనకి రెండు నెలల్లో సప్లయి కావాలి. ఆమధ్య జపాన్ నుంచీ, స్టేట్సునుంచీ ఏవో కొటేషన్లు వచ్చాయి. టర్మ్సు చూసేందుకు టైమ్ లేకపోయింది. చూసి ఇవాళే కేబిల్ చెయ్యండి. వెంటనే లెటర్ ఆఫ్ క్రెడిట్ ఓపెన్ చెయ్యమని బేంకింగ్ డిపార్టు మెంటుకి చెప్పండి" అన్నాడు.

ముందరచూస్తే కోబేవాళ్ళ కొటేషన్ బాగుంది తరవాత అన్ని కొటేషనులూ చూస్తే ఏంచెయ్యాలో తెలియలేదు. కోబేవాళ్ళకే ఆర్డరు చేసేస్తే – కాని యునైటెడ్ స్టేట్సు ధరలు కొంచెం ఎక్కువే ఐనా, టర్మ్సు బాగున్నాయి.

"ఎక్స్క్యూజ్ మీ"

"ఎదురుగా నోట్ బుక్ తో నిలబడింది ఆలిస్ చిరునవ్వుతో. ఆ బుగ్గల లొత్తలు చూసినప్పుడల్లా ఆపుకోలేని ఆవేశం వొస్తుంది ప్రకాశానికి.

"డిక్టేట్ చేస్తారా?"

ఆమె ఎందుకని అలాగ చిరునవ్వు నవ్వుతుంది? తనని పిచ్చివాడిని చెయ్యడానికా? తనకి మనోనిగ్రహం అపారం గనక కాని....

"ఇంకా చూస్తున్నాను"

ఇంకో నలభై నిముషాల్లో ఉత్తరం వెళ్ళకపోతే రేపటికి టోక్యో జేరదు."

"జపానుకి రాస్తానని మీకు ఎవరు చెప్పేరు?" కొంచెం కోపం వొచ్చింది తనకి,

ఆమె నిటాగ్గా నిలుచుని తన కళ్ళల్లోకి క్షణమాత్రం చూసింది. చిన్న చిరునవ్వు ఇంకొంచెం తగ్గి మళ్ళీ లొత్తల్లోకి మారింది.

"స్టీలు షిప్‌మెంట్స్ అన్నీ జపాన్‌నించే. మీరు ఈ ఫోల్డర్లన్నీచూడ్డం ఐపోయింది. అందుకని తెలిసింది"

బాగా కోపం వొచ్చింది తనకి.

"మిస్ ఆలిస్! మీ పని మీద చూసుకోండి. నాకు అవసరం ఉన్నప్పుడు పిలుస్తాను. ఫోల్డర్స్ తీసుకు వెళ్ళవచ్చును."

అనుకోని కటుత్వం వొచ్చిందికంఠంలోకి. కాని, ఆమెని దూరంలో ఉంచకపోతే ఏదో ఒకరోజు క్షణిక దౌర్బల్యంలో తాను ఆమెని చేతుల్లోకి తీసుకోక తప్పదని ప్రకాశానికి తెలుసును- అదీకాక, లక్షరూపాయిల సరుకు అన్ని విషయాలు చూడకుండా, నిరాలోచనగా ఆర్డరులాగ పంపివెయ్యడం?

ఆలిస్ చిన్న బుచ్చుకుంది....ప్రకాశం బాధపడ్డాడు. సారీ....అందామనుకున్నాడు. నాలిక చివరిదాకా వొచ్చినా, ఆపుకున్నాడు. అనాలోచనగా, ఆ క్షణపు ఆవేశంలో సారీ అంటే.... ఆలిస్‌ని ఎంత దూరంగా ఉంచితే అంత మంచిది.

ఆలోచించసాగాడు ప్రకాశం.

ఇంటర్‌కామ్ సన్నగా రొదచేసింది.

"ప్రకాశ్! కేబిల్ చేశారా?" డైరెక్టరు.

"....లేదు....చూస్తున్నాను."

"గాడ్! వెంటనే పంపండి. కోబేకన్న మంచి టరమ్స్ ఉంటాయనుకోను. వీలైతే జాన్యువరీ ఆఖరికి ఫిబ్రవరి షిప్‌మెంట్ అడగండి. థాంక్స్."

ఆలిస్‌ని పిలిచి కేబిల్ పంపాలి ఉత్తరం డిక్టేట్ చెయ్యాలి.

టెలిఫోన్.

"హల్లో"

"ఆవతలి స్వామి, అతను మొదలు పెడితే పదిహేను నిమిషాలదాకా ఆగడు. పైగానే రిసీవర్ కిందని పెట్టేద్దామనిపించింది. నాలుగున్నర ఐపోయింది....టైము లేదు.

పూర్తిగా పన్నెండు నిమిషాలు మాట్లాడి బలవంతాన "మీకు చాలా తొందర ప్రకాశం" అని నిష్టూరంగా అని స్వామి ఫోను వొదిలాడు.

"కాల్ బెల్‌తో ఆలిస్‌ని పిలిచాడు ప్రకాశం. కేబిల్ డిక్టేట్‌చేసి, "ఇది వెంటనే పంపండి- ఉత్తరం డిక్టేటు చేస్తాను" అన్నాడు.

కేబిల్ టైపుచేసి సంతకం తీసుకుని మళ్ళీ డిక్టేషన్‌కి వొచ్చింది ఆలిస్. ఈసారి ఆమె చిరునవ్వడంలేదు. బుగ్గలు ఎర్రగా ఐపోయాయి, ఆపిల్స్‌లాగ....

ఆలోచనలు కూడదీసుకుని పదినిముషాలు డిక్టేట్ చేశాడు. ఐదుకి రెండు నిముషాలు.

ఆమె వెళ్లే స్పెషల్ ట్రామ్ డల్హౌసీ స్క్వ్యార్‌నించి ఐదూపదికి బయలుదేరుతుంది. ఆ సంగతి ప్రకాశానికి తెలుసును. కాని....

ఆమె మాట్లాడకుండా వెళ్ళిపోయింది. సారీ, సారీ అనుకున్నాడు. కాని తాను ఆ మాటే ఆమెతో అంటే ప్రమాదం,

ఈ ఆరునెలలూ ట్రైనింగ్ పూర్తైతే తనకి మేనేజరు పదవి తప్పదు. ఈలోగా ఏ విధమైన కథలకీ తను నాయకుడు కాదలచుకోలేదు ప్రకాశం. అనాలోచనలో పనులుచేసే ఫలితాలు తనకి తెలుసును.

ఐదూ పదిహేను....

ఉత్తరం టైపుచేసి తెచ్చి తనముందు పెట్టింది ఆలిస్. ఆమె తెల్లటి బ్లౌజువేపుచూసి, తల వొంచుకుని ఉత్తరం చదివి సంతకంపెట్టి పంపించి లేచి టై సద్దుకుని నిలబడ్డాడు ప్రకాశం.

ఆలిస్ ఎలాగ వెడుతుంది?

ఆమెకి ట్రాము దొరకదంకల్ల- బస్సులు చెప్పనే అక్కర్లేదు. తన మూలంగా ఆలస్యం ఐపోయింది....తనతో తీసుకుని వెడితే?

అందరూ ఏమంటారు? డైరెక్టర్ ఏమనుకుంటాడు? బయట చూసిన వాళ్ళందరూ....

ఈ మహానగరంలో తనకి తెలిసినవాళ్ళు తక్కువ, కాని.... ఆమె మరీ అందంగా

వుంటుంది. ఇప్పటికే కూడని చనువు తీసుకుం టోంది.

మరో ఐదునిమిషాలు ఆలోచించాడు—ఆలో చిస్తూనే బయటికి నడిచాడు.

తనకోసం కారు సిద్ధంగా ఉంది. మిగిలిన వాళ్ళందరూ వెళ్ళిపోయారు.

అతను మెట్లు దిగగానే వెనకాల హీల్స్ చప్పుడు. అనాలోచితంగానే వెనుదిరిగాడు. అలిస్....

ఆమె తనవేపు చూడనే లేదు — అతనికి కొంచెం చిరాకు వేసింది. ఇంత కోపంఉంటే ఆమె ఎలాగు పనిచెయ్యగలదు?

కార్లో కూర్చున్నాడు. డ్రైవరు స్ప్రింగ్ రోడ్డులోకి తీసుకునివచ్చేసరికి పేవ్‌మెంట్ మీద అలిస్ నడుస్తూ కనిపించింది. ఆగి, లోపలికి పిలుద్దామనుకున్నాడు. కాని.... ఆమెని దాటి వెళ్ళిపోయింది కారు అతను నిశ్చయించేలోపునే.

ట్రాములకోసం హేర్‌స్ట్రీట్ క్రాసింగు వద్ద కారు ఆగింది. ఆలోచించకుండానే వెను తిరిగి చూశాడు. డైరెక్టర్ ముఖర్జీ కారుదిగి ఆమెని ఎక్కించుకుని మళ్లీ కారులో కూర్చు న్నాడు.

కళ్ళు మిరుమిట్లు గొల్పాయి ప్రకాశానికి. ఆ పని తనే ఎందుకు చెయ్యలేదు? అలిస్ ఎంత బాగుంటుంది! అనుకున్నాడు.

కంపెనీ ఫ్లాటు ఆలీపూర్‌లో ఉంది ప్రకా శానికి — రెండేగదులు — కాని. ఎంతో సౌక ర్యంగా ఉంటుంది.

స్నానంచేసి వొచ్చి బోయ్ తెచ్చిన టీ తాగి ఏదో పుస్తకం తీసుకుని కుర్చీలో కూర్చున్నాడు. మళ్లీ అలిస్ జ్ఞాపకం వొచ్చింది. డైరెక్టర్ ముఖర్జీ ఈపాటికి— బల వంతాన ఆలోచనలు మళ్లించుకున్నాడు పుస్త కం మీదకి.

సాగలేదు.

ఇంతలో టెలిఫోన్ —

అది మద్రాసునించి ట్రంకాల్. కొద్ది నిమిషాల్లోనే శేఠ్ కౌశమల్ గొంతుక—

తన యోగక్షేమాలు తరవాత చెప్పేడు. ముఖర్జీకోసం బుక్ చేశాడుట కాల్. అతను లేకపోతే తనకి డైవర్టు చేశాడు.

"రేపు కారవిల్‌లో రాధా, మల్లిక్ వొస్తు న్నారు. అక్కడినించి ఎల్లుండి ఖట్మండూ వెడుతున్నారు. రేపు వాళ్లని కల్సుకొండి— గ్రాండ్‌లోనో గ్రేట్ ఈస్టర్న్‌లోనో రూము ఏర్పాటు చెయ్యండి"

"మల్లిక్..."

"ఆఁ హనీమూన్‌కి వెడుతున్నారు వాళ్లు. ఐ. ఏ. సీ ఫ్లయిట్‌లో రిజర్వేషన్ చేశాను. థాంక్స్"

టెలిఫోను రిసీవరు కిందని పెట్టేడు. రాధ, మల్లిక్! పెళ్లి చేసుకున్నారా?

కొద్ది క్షణాలు ఏమీ తెలియలేదతనికి. తనని తానే నమ్మలేకుండా ఉన్నాడు. రాధ!

మళ్ళీ టెలిఫోన్.

ఎక్స్ఛేంజినించి కాల్ ఐపోయిందా? అని.

ఆఁ థాంక్స్

మళ్ళీ రాధ! హనీమూన్ మల్లిక్‌తో.

బాదగా డైరెక్టరీ తెరిచి గ్రాండ్ హోటల్ నంబరు వెతకడం ప్రారంభించేడు. ప్రకాశం ఒక్క క్షణం అనిపించింది—ఈ పని చేసేకన్నా ఉద్యోగానికి రాజీనామా ఇస్తే నయం అని. మరుక్షణం యీ కంపెనీ ఫ్లాటూ, కారూ, వంద రూపాయల నోట్లు చెక్కులూ జ్ఞాపకం వొచ్చాయి.

గ్రాండ్ హోటల్ నంబరు డయలు చేస్తు న్నాడు ప్రకాశం.

సరీగా సంవత్సరం క్రిందట

తాను ఎం. ఏ. పేసైనట్టు ఆ రోజే తెలి సింది. సెకండ్ క్లాసు వొచ్చినా, చాలాసంతో షంగా ఉన్నాడు. ఇంటికి వొచ్చేసరికి అమ్మ ఎవరితోనో మాట్లాడుతూంది.

ఆమె చాలా సంఘాల్లోనూ సమితుల్లోనూ సభ్యురాలుగానో, కార్యకర్తగానో చాలా సంవ త్సరాలనించి పనిచేస్తోంది. కొత్తవారెవరూ రావడం ఆశ్చర్యంకాదు.

తను లోపలికి వెళ్ళబోతోంటే ఆమె పిలి

ఉంది. "ఫ్రీడే మా ప్రకాశం రెడ్డిగారూ; ఈ యువ పార్లమెంటు మెంబరు" అని పరస్పర పరిచయం చేసింది.

తను నమస్కరించి కూర్చొని, తన రిజల్టు సంగతి చెప్పేడు. ఆ తరవాత కాఫీ తెచ్చి ఇచ్చేడు. హఠాత్తుగా ఎమ్ పీ గారు తన్ను చూసి "ఏంచేస్తారు ఎమ్మే పాసై?" అన్నాడు.

"తెలీదండి!"

ఆయన క్షణమాత్రం ఊరుకుని, "భారత్ స్టీల్స్‌వాళ్ళని నాకు తెల్సును. వాళ్ళు ఆఫీసర్లని రిక్రూట్ చేస్తున్నారు. మీ అమ్మగారికి ఏదైనా సహాయం చేద్దామని చాలాకాలంనించి అనుకుంటున్నాను. అందులో జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరుకి ప్రొబేషనరుగా వేయిస్తాను వెడతారా?" అన్నాడు.

తనకి తెల్సును — ఆ పోస్టు చాలా కష్టం అని — ఫస్టుక్లాసు వొచ్చినా దొరకదు...

జవాబుకోసం ఏదో గొణిగాడు — మరో పదిహేను రోజుల్లో ఇంటర్వ్యూ — సెలెక్షన్.

తాను ట్రయినింగు కోసం జాయిన్ ఐన నాడు శేఖ్‌జీని చూసేందుకు అతని ఆఫీసుకు వెళ్ళేడు. తనంటే శేఖ్‌జీకి చాలా గౌరవం ఉందని గ్రహించినా, ఆశ్చర్యపడలేదు ప్రకాశం —

పదినిముషాల్లో తలుపు తీసుకుని, విద్యుల్లతలాగ లోపలికి వచ్చింది రాధ —

తనకి కలలాగ ఉంది. ఆ క్షణం ఈ నాటికీ మరిచిపోడు తను. చెవులరింగులూ, మెడలో సన్నటి గొలుసూ తప్ప ఒక్క ఆభరణం లేదామెకి— కాని —కాని—

ముందర శేఖ్‌జీ ఆమెని తనకి పరిచయం చెయ్యనేలేదు, ఆమె తండ్రికి ఏదో సంజ్ఞ చేసింది— వెంటనే శేఖ్‌జీ వాళ్ళిద్దరికీ పరిచయం చేశాడు.

"రైట్. ఇవాళ నన్ను సినిమాకి తీసికెళ్ళండి" అంది రాధ— మరో నిముషంలో.

"సినిమాకు?...." గాభరా పడ్డాడు ప్రకాశం.

ఆమె చిరునవ్వి "ఆఁ! మై ఫెయిర్ లేడీకి రెండు టికెట్లు ఉన్నాయి. శేఖర్ వస్తా రనుకున్నాను. కాని ఆయనకి పని ఉందిట మీరు రండి!" అంది.

ప్రకాశం జవాబుఇచ్చే లోపునే, "మీరు వెళ్ళండి అమ్మాయి ఒంటరిగా వెడితే బాగుండదు" అన్నాడు శేఖ్‌జీ.

అలాగే క్రమంగా క్రమంగా దగ్గరగా వొచ్చింది, రాధ ఎంత బాగుంటుంది! ఆమె ఏదైనా అనుకుందో చేసిందే అదే లోపం.

మల్లిక్ బొంబాయినించి తరుచు వొస్తూ ఉండేవాడు పనిమీద.

ఒకనాడు సాయంత్రం ఆరు గంటలకి. తనకి బాగా జ్ఞాపకం తాను కాఫీ తాగుతూంటే రాధ లోపలికి వొచ్చింది తన ఇంట్లో, ఆమె ముఖంనిండా కోపరేఖలు. గుండె జల్లుమన్నది ప్రకాశానికి.

"కాఫీ బయట తాగవొచ్చును. బట్టలు మార్చుకుని రండి" అని కుర్చీలో కూర్చుంది తాను స్వాగతం చెప్పేలోగానే.

"ఏం జరిగింది రాధా? ఎందుకలాగ ఉన్నారు?"

"మల్లిక్ ఉన్నాడు, మీరు వొస్తారా, రారా?"

ఇంక ప్రశ్నలడిగి లాభంలేదని తెలుసును తనకి. ఐదు నిముషాల్లో బట్టలు మార్చుకుని ఆమెతో కారులో బయలుదేరాడు,

గంటసేపు ఎక్కడెక్కడో తిరిగి మెరీనా హోటల్‌కి వొచ్చారు. కూర్చుని - "ప్రకాశ్ నన్ను గురించి మీరేం అనుకుంటారు?" అన్నది రాధ హఠాత్తుగా.

సముద్ర తరంగాలు బయట— తన హృదయంలోనూ మహాతరంగాలే. బయట సుందర పరిసరాలు— ఎదురుగా రాధ.

"మీ రంటే ప్రాణం ఇద్దామని ఉంటుంది. మీ ప్రేమకోసం ఏమైనా చేద్దామని అనుకుంటూంటాను."

ఆ మాట లతని పెదవులదాకా వొచ్చి ఆగిపోయాయి — నయం! ఎంత ప్రమాదం జరిగి వుండేది!"

"[illegible] ఆలో-
చింది వస్తువేస్తే"

ఆమె నవ్వింది- "చూడండి- మీరు జీవితంలో కోరేదేమిటి?- నిజంచెప్పాలి!" అంది.

"సుఖపడ్డం, ఆనందం"

"డబ్బు-?"

"ఆc అది లేకపోతే అసలు జరగదుగా!"

వెయిటర్ కాఫీ తెచ్చేడు. తాగుతూంటే ఆ నిశ్శబ్దం వెక్కిరిస్తోన్నట్లనిపించింది ప్రకాశానికి.

"మీరు?"

"ఏదో ఆలోచిస్తూన్న రాధ ఒక్కసారి చూసి "ఏమిటి?" అంది.

"జీవితంలో కోరేది"

అతని కళ్ళల్లోకి తీక్షణంగాచూసి, "నిజంగా చెప్పేదా?" అంది రాధ.

"ఆ!"

"డబ్బులేని భర్తకావాలి. ఆరుగురు పిల్లలు కావాలి. చక్కటి పిల్లలు అందమైన పిల్లలు. అల్లరి చేసేవాళ్లు.

ఆమె కళ్ళల్లో కలలు కనిపించేయి తనకి-క్షణంమాత్రం- నిజంగా.

నవ్వేడు ప్రకాశం,

"అందుకే పీకపోయినా నేను మల్లిక్‌ని పెళ్ళి చేసుకోనని చెప్పేను నాన్నగారికి. అతని తాగుడూ, తిరగడాలూ నాకు తెల్సును- అన్నీ అబద్ధాలంటారు నాన్న. నాకు తెల్సు, అన్నీ నిజం!

మళ్ళీ కోపం చారలు కళ్ళల్లో.

బాగా చీకటి పడిపోయింది. తిరుగుముఖం పట్టేరు. కారులో ఆమె మాట్లాడలేదు. ఆమెని ఇంటిదగ్గర వొదిలి తను వెళ్ళిపోయాడు.

"విచిత్రంగా మాట్లాడుతుంది రాధ, అన్నీ క్షణిక స్వప్నాలే!" అనుకున్నాడు తాను మనస్సులో.

మరోనెల గడిచిపోయింది. రాధ ఒకటి రెండుసార్లు కనిపించింది పార్టీల్లో. మునుపటి కాంతి లేనామె ముఖంలో, తనతో మునుపటి చనువులేదు. కాని అతనికేమీ విచిత్రంఅనిపించలేదు, కాని అనిపించలేదు, తక్కినవాళ్ళ బాధలు క్షణికాలు" అనుకున్నాడు.

ఆవారంలోనే మల్లిక్ వొచ్చాడు.

అతను వొచ్చిన మూడో రోజున ఇంట్లో ఎవ్వరూ లేరు. అమ్మ కోయంబత్తూరు వెళ్లింది. తను వసారాలో పడుకుని చంద్రుడి వంక చూస్తూ ఆలోచిస్తున్నాడు.

కాల్ బెల్,

బుష్ షర్టు వేసుకుని వెళ్లి తలుపు తీసేడు. రాధ!

"మీరా!"

"ఆc!"

నిశ్శబ్దంగా ఆమె లోపలికి వొచ్చింది అతను తలుపువేసి వొచ్చి డ్రాయింగ్ రూంలో లైటువేసేడు, ఆమె అక్కడ కూర్చోకుండా వెళ్ళి తన మంచంమీద కూర్చుంది

అతనికి మహా స్వప్నంలాగ ఉంది. ఏం జరుగుతూంది? ఈ విచిత్రమైన రాక.

ప్రక్కన కుర్చీమీదనుంచి పుస్తకాలు తీసి కూర్చుని "ఏమిటి రాధా?" అన్నాడు.

రెండు నిమిషాలు ఆమె మాట్లాడలేదు. ఆ తరవాత త్వరత్వరగా "ప్రకాశ్! నన్ను పెళ్లి చేసుకుంటారా? ఈ ఉద్యోగం, నేవ వొదిలి ఎక్కడికో తీసికెళ్లిపోతారా? నాన్నది ఒక్క పైసకూడా వొద్దు. ఇద్దరం ఉద్యోగం చేద్దాం, చెప్పండి" అని ఆగిపోయింది.

ఈమెకి మతి చలించింది- అనుకున్నాడు ప్రకాశం. కొంచెం భయం వేసింది.

'ఆవేశ పడకండి మీకూ శేలెజీకి ఏదో వాదన వొచ్చిందనుకుంటాను. ఆలోచించండి- త్వరపడి ఏంచేసినా ముమ్ముందు ప్రతిదినం విచారిస్తాము. రేపు ఉదయం మీరే మళ్లి ఇలాగ అనుకోరు"

తన శక్తి అంతా వినియోగించి ఉపశమనం చేసేడు. మంచినీళ్ళు ఇచ్చి "కొంత నయంగా ఉందా?" అన్నాడు.

ఆమె నవ్వింది. బాధపడుతున్నట్టుంది.

మర్నాడు డైరెక్టర్‌తో డమ్‌డమ్ వెళ్లేడు పూలమాలతో. కారవిల్ లేటయింది. వొచ్చే

[illegible] పలికిపోయింది.

అతను మూలని ఆమెకోసం అని ఎత్తిపట్టుకున్నాడు ఇంతలో మల్లిక్ వొచ్చి దాన్ని తీసుకుని, "థాంక్స్ ప్రకాశ్." అన్నాడు.

ఏదో గొణిగి ప్రకాశ్ రాధకోసం చూశాడు. ఆమె మిసెస్ ముఖర్జీతో గేటువేపు నడుస్తోంది. తనవైపు చూడనేలేదు.

ఆ విషయం గమనించిన ప్రకాశంకి బాధకన్న గర్వం ఎక్కువగా ఐంది. ఆరాత్రి- తాను చెప్పలేదూ ఈ క్షణిక దౌర్బల్యాలు.

ఓ. ఓ. ఏ. సీ. ఫ్లయిట్‌లో ఎవరో వొస్తారని మిసెస్ ముఖర్జీ ఏరోడ్రోమ్‌లో ఉండిపోయింది. ముఖర్జీ, మల్లిక్ ఒకకారు తీసుకుని వెళ్లిపోయేక తానూ, రాధా రెండో కార్లో వెళ్ళాలని గమనించిన ప్రకాశానికి గుండె దడదడలాడింది.

రాధ ఏమీ మాట్లాడలేదు - అప్పటి చలాకీ లేదు. సీరియస్‌గా ఆలోచిస్తూంది. ఇప్పుడు 'భార్య'గా మనిషి సహజంగానే మారింది అనుకుని తాను నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

గ్రాండ్ చేరేక ఆమె "మల్లిక్, ముఖర్జీ స్టూడియోకి వెళ్ళేఉంటారు. మీరు మీదకి రండి" అంది. ఆజ్ఞాపిస్తూన్నట్టు అతను నిశ్శబ్దంగా ఆమెతో నడిచేడు. సామాన్లు చేరేక, అతను వెళ్ళి పేంట్‌లో కూర్చున్నాడు. ఆమె మరో పదినిమిషాల్లో స్నానంచేసి వొచ్చి కూర్చుంది అన ఎదుటి కుర్చీలో.

వెయిటర్ వొచ్చేడు.

"రెండు ఫోట - వైట్ హార్స్"

తన చెవుల్ని నమ్మలేక పోయాడు ప్రకాశం - రాధ! "నేను తాగను. ఏపిల్‌జ్యూస్"

"ఆల్‌రైట్!"

నవ్వుతోందా? ఆమె విస్కీ అంటే ఎంత అసహ్యించుకుంటూ ఉండేది!

"చెప్పండి ప్రకాశ్! ఎలా ఉన్నారు?- సుఖంగా, ఆనందంగా ఉన్నారా?"

"మీరు చెప్పలేదు సంవత్సరం ఐపోయింది మిమ్మల్ని చూసి..."

"మీ మాట చెప్పండి!"

[illegible] పోస్తూ మళ్ళీ చిరునవ్వు నవ్వింది రాధ.

"కలకత్తాలో ఎవరినైనా ప్రేమించారా?"

అతను పొడిగా నవ్వాడు.

"మీరు - మీరు సుఖంగా ఉన్నారా?"

"ఆ! మల్లిక్ మంచి మనిషి - మంచి మనిషి - ఉషారు ఉన్నవాడు. ఈ రింగు చూడండి. నిజంగా అమూల్యమైన వజ్రం."

ఆమె ఉంగరంతీసి అతని చేతిలో పెట్టింది. చల్లగా ఉంది అతని చేతిలోఉంగరం—"బాలా బాగుంది" అని మెరుస్తోన్న రాయివేపు గమనించిచూసి ఉంగరం ఆమె చేతిలో పెట్టబోయాడు.

ఆమె చెయ్యి విప్పి వేళ్ళుజాపింది. అతని చెయ్యి వొణికింది. ఆమె అరచేతిలో ఉంగరం పెట్టి, "జాగ్రత్త!" అన్నాడు.

"థాంక్స్!" అని, గ్లాసు త్వరత్వరగా ఖాళీ చేసి, బేరరుకోసం సిగ్నలు చేసింది రాధ.

"ఆ! తప్పేమిటి? ఆనందం ఇస్తుంది"

"కాని—"

"మానెయ్యమంటారా?"

తనకేం హక్కు ఉంది? ఆమె మల్లిక్ భార్య!

"మీరే ఆలోచించండి"

నిట్టూర్చి అతని ముఖంలోకి చూసింది రాధ. ఆ తీవ్రతకి తట్టుకోలేకపోయాడు ప్రకాశం.

"ఖాట్మండూలో ఎన్నాళ్ళు ఉంటారు?"

"ఆయనగారి ఇష్టం —"

ఆమె డ్రింక్ ముట్టుకోలేదు.

తల వొంచుకుని తన ఉంగరంవైపుచూస్తూ ఏదో ఆలోచిస్తూంది రాధ.

"చూడండిప్రకాశ్! రాత్రి ఎంతోబాగుంది. లేక్సదాకా తిరిగివద్దామా?"

గ్లాసులోఉన్న సగం ఆపిల్ జ్యూస్ తాగి "మల్లిక్ ఒస్తేబాగుండదేమో" అన్నాడుప్రకాశ్

"అవును అవును మరిచిపోయాను" అని రాధ తన గ్లాసు తీసుకుంది.

(తరువాయి 105 పేజీలో)

(64 వ పేజీ తరువాయి)

యింకా బాగా గుర్తుంది. చీరెలు కట్టుకుని ఆరిందాలా ఆదరిస్తున్న యీ ఉమ యింకెవరో అమ్మాయిలా వుంది.

"ఏమిటలా చూస్తున్నావు?" అద్దంలో తన ప్రతిబింబం గమనించి నవ్వుతూ అడిగింది.

"ఆ ప్రశ్న నేను నిన్నే అడగాలనుకుంటున్నాను" అన్నాడు.

"నీకోసం నేను ఏవేవో చేయాలనుకున్నాను. హఠాత్తుగా వచ్చి అన్నీ పాడుచేసేశావు. పో!" ఆపేక్షగా విసుక్కుంటూ అక్కడి నుంచివెళ్ళిపోయింది. ఉమయిట్లా విసుక్కోవటం అప్పుడప్పుడు జరుగుతూనే వుంటుంది. తనని గురించి ఏమి ఊహిస్తుందో ఏమిటో తెలియదు. కాని వుమ వూహల్ని తెలియకుండానే తను పాడు చేస్తుంటాడని తెలిసినప్పుడు కాస్త బాధే కలుగుతుంది. ఏమేం వూహించుకున్నావు చెప్పు అని అడగడం తనకి రాదు వుమ చెప్పదు. అందుకని వుమ కరిగిపోయిన కలలు చాలా సార్లు అలాగే అజ్ఞాతంగా వుండిపోయినాయి.

ఆ రాత్రి భోజనాలవీ అయిపోయిం తర్వాత హాయిగా, నిశ్చింతని అనుభవిస్తూ, తెల్లటి వెన్నెల్లో దొడ్లో బీరపాదుకి కొంచెం దూరంలో చాపవేసుకుని పడుకుని తీరికగా వైజాగ్‌లో జరిగిన సంఘటనలన్నీ నెమరు వేసుకుంటుండగా దిండు తెచ్చి అందిస్తూ "వెన్నెలంతా నీ ఒక్కడికేలాగావుందే" అంది.

"కావాలంటే నువ్వూ పంచుకోవచ్చు."

"ఉండు నువ్వువచ్చిన హడావిడిలో మల్లెపూలమాటే మర్చిపోయాను. గుచ్చుకోవాలి. తెచ్చుకుంటాను" ఉమ లోపలికివెళ్ళి పళ్ళెం నిండాపూలతో, సూదీదారంతో తిరిగి వచ్చింది.

చాపకి దగ్గరగానేవున్న రాయిమీద కూర్చుని పూలు తీసుకుని గుచ్చటం ప్రారంభించింది. "ఇలా దగ్గరిగా కూర్చో" అనాలనిపించింది. కాని పైకి ఇప్పుడంత కష్టపడి ఓపిగ్గా గుచ్చకపోతేనేం?" అన్నాడు.

"పాపం పూలు ఏడవ్వూ?" అంది.

"ఏడుస్తాయా? ఎంత కొత్త విషయం? పూలకి నవ్వటం తప్ప ఏడవటం అనేదే తెలియదనుకుంటున్నాను" అన్నాడు.

"ఏడుస్తాయి. అప్పుడప్పుడు. ఊ ఊ. చెప్పు. చెప్పు. వైజాగ్ విశేషాలేమిటి?"

"చెప్తే హడలిపోతావేమో!"

ఉమ కుతూహలంగా తలెత్తి చూసింది. "ఏం? అమ్మాయిల గురించి చెప్పబోతున్నారా?"

నా జీవితంలో వుమ అనే అమ్మాయిని గురించి తప్ప యింకే అమ్మాయినీ తెలుసుకోవటం జరగదు."

అలాగే పాపం! అన్నట్లు చూసింది.

ఒక్కసారి వుమ తమాషాగా చూస్తుంది. చెప్పాలనుకున్నది నోటితోనేకాదు. కళ్ళతో కూడా చెప్పవచ్చు అన్నట్టుంటుంది.

"ఇక మొదలు పెట్టు నీ విశేషాలు. తొందర పెట్టింది. ఇంట్లో అడుగు పెట్టినప్పటి నుంచి జరిగిందంతా వుమకి ఎప్పుడెప్పుడు చెప్తానా అని ఆరాటపడుతున్న హృదయం తీరా సమయం వచ్చే సరికి ఏం చెప్తావు దానికి మూగవోయినట్టు మౌనం వహించింది.

"చెప్పుబావా: ఏమిటి విశేషం?"

చివరికి ఎలాగో బలవంతాన మొదలు పెట్టాడు. ప్రారంభించటం కష్టమైంది కానీ నోరువిప్పి చెప్పడం మొదలుపెట్టేసరికి మాటలు ప్రవాహరూపం ధరించి వుధృతమైన వేగంతో వురకసాగినాయి. మొట్టమొదట విద్యాపతితో పరిచయం గురించీ, అదెలా అభివృద్ధి చెందిందీ, చివరికి ఎలా జరిగిందీ, ఆఖరి రోజుల్లో వైజాగ్‌లో తనెంత నికృష్టమైన బాధలకి గురి అయ్యాడో, వుమచేసిన మనియార్డర్ కోసం చూడటానికి ఓపిక ఎందుకు లేకపోయిందో, ఎప్పుడెప్పుడు వచ్చి యింట్లో వాలుతానో అని ఎంత తహతహలాడిపోయాడో పూర్తిగా వివరించాడు.

ఉమ పువ్వులు గుచ్చటం ఎప్పుడు మానేసిందీ అతను గుర్తించనేలేదు. ఆశ్చర్యంతో తల ముక్కలైనదానిలా రెప్ప వాల్చకుండా యిటే చూస్తూ శిలా ప్రతిమలా కూర్చుంది

పోయింది. చెప్పటం ముగించిన తను నిట్టూర్పు విడుస్తూ "వుమా ! పరీక్ష ఈసారి పోతుంది నాకు తెలుసు" అన్నాడు.

ఉమ చాలాసేపు మాట్లాడలేదు. తనకా మౌనం వురితాడులా అన్పించింది. "పూలు గుచ్చటం మానేశావు" గుర్తుచేశాడు.

ఉమ మళ్ళీ సూది మీదకి పూలు ఎక్కించటం ప్రారంభించింది. అంతటా నిశబ్దం వహించింది. వెన్నెలలో బీరపాదుమీద విచ్చుకున్న పూలు పెద్దపెద్ద నక్షత్రాల్లా మరింత తెల్లగా వున్నాయి.

"అత్తయ్య పడుకుందా?" ఎలాగో అయిపోయిన ఉమని చూసి మాటల్లోకి దించాలని ప్రయత్నిస్తూ అన్నాడు.

"పడుకున్నట్టుంది."

మళ్ళీ నిశ్శబ్దం.

తమ దిండులో ముఖం దాచుకున్నాడు.

కొద్దిసేపయింతర్వాత వుమ చేయివచ్చి తల మీద పడింది వులిక్కిపడ్డాడు తను.

"లే బావా ! లోపలికి పోదాం పద."

సమాధానంగా వుమ చేయి తన చేతిలోకి లాక్కున్నాడు. "జరిగిందానికి నువ్వేం బాధ పడకు. ఇందులో నీ ప్రమేయం ఏమీలేదు. నా పరీక్ష పోతే కేవలం నా దురదృష్టం అనుకుంటాను అంది. మొదటినుంచి ఈ చదువు నీది కాదు నాది అని చెప్పానుగా" అంది.

పెద్ద గాలిదుమారం వస్తుందని ఎదురు చూసిన మనిషికి చల్లటి పిల్లగాలి వీచినప్పుడు ఎలా అన్పిస్తుందో అలాగే అన్పించింది. పరీక్ష పోతుందేమో అన్నప్పుడు వుమ బాధ పడుతుందని, కోపగించుకుంటుందని, ఆవేశంతో ఏవేవో మాటలు అని తీసుతుందని వీటన్నిటినీభరించటానికి సిద్ధమై వున్నాడుతను. ఉమ స్వభావానికి విరుద్ధంగా ఏమీ అనకపోవడం ఆశ్చర్యమనిపించింది. "అంతా నా దురదృష్టం" అని ఒక్కమాటతో కర్మసిద్ధాంతానికి ముడివేసి వదిలేస్తుందని కల్లో కూడా అనుకోలేదు.

"నీ చేయి యింత వేడిగా వుందేమిటి?" హఠాత్తుగా అడిగాడతను.

"అప్పుడప్పుడూ సాయంత్రంపూట అలాగే అన్పిస్తుంది," చేయి మెల్లగా విడిపించుకుంటూ అంది.

"లే బావా ! లోపలికి వెళ్దాం" లేస్తూ అంది. వెంటనేలేచి యాంత్రికంగా లోపలికి వచ్చాడు.

ఆ రాత్రి వుమ సరిగ్గా నిద్రపోలేదన్నట్టు సూచనగా మధ్య మధ్య దగ్గు విన్పిస్తూనేవుంది తనకి. ఒకసారిలేచివెళ్ళి మాట్లాడదామా అనిపించింది. మళ్ళీ యిదంతా అత్తయ్య వింటుంది. ఎందుకొచ్చిన గొడవ అన్పించి వూరుకున్నాడు. మొదట అసలు ఉమకికూడా చెప్పకుండావుంటే బాగుండేదేమోఅన్పించింది. కాని ఫలితాలు తెలిసింతర్వాత ఒక్కసారిగా నిరాశ చెందేకంటే దానికి ముందుగానే సిద్ధమైతే నయంకదూ! పరీక్ష ఫలితాలు వచ్చే వరకూ ఉమతోపాటు తనుకూడా పాసవుతానన్నట్టే కలలు కనడం సాధ్యంగా కన్పించలేదు. తనకి తెలుసు. ఆక్షణంలో పైకి ఏమీ అనకపోయిన తర్వాత మనసులో ఉమకి యీ విషయం ఎంత అఘాతం ఏర్పడిందో వూహించలేని విషయంకాదు. కానీ ఏం చెయ్యాలి! యీ ప్రపంచంలో మన చేతుల్లో వున్న దానికంటే లేనిదే ఎక్కువేమో! మనకి సాధ్యమైన పనులకంటే అసాధ్యమైనవే అనేకంగా కన్పిస్తున్నాయి. ఉమకి అంతా చెప్పింతర్వాత గుండెలు తేలికబడ్డాయి.

చాలారోజులతర్వాతపడుకోగానేకంటినిండా నిద్ర పట్టసాగింది. పగలు సాధ్యమైనంతవరకూ యింట్లోవుండేవాడు కాదు. ఏ లైబ్రరీలోనో, పంచాయితీ బోర్డు ఆఫీసులోనో గడిపేవాడు.

ఆరోజు సాయంత్రం-లైబ్రరీ నుంచి ఇంటికి వచ్చేసరికి ఉమ పడుకునివుంది.

అత్తయ్య కషాయంలాంటిది త్రాగిస్తోంది.

తనువచ్చి దగ్గర కూర్చున్నాడు.

"మళ్ళీ ఇవ్వాళకూడా జ్వరం వచ్చిందా" అత్తయ్యా.

రోజూ సాయంత్రం అయ్యేసరికి వస్తోందేమిటి?" అన్నాడు తను. ఉమ తను వచ్చిన ఈ వారం పదిరోజుల్లో మరీ చిక్కిపోయింది.

దగ్గుకూడా బాగా వస్తోంది, ఊళ్ళో ఆయుర్వేద వ డిపడు "బాగా వేడిచేసింది" అని చెప్పాడు. తన పరీక్ష గురించి బెంగపెట్టుకుంది అనుకున్నాడుతను.

అత్తయ్య మందుగ్లాసు తీసుకొని లోపలికి వెళ్ళిపోగానే ఈ విషయం గురించి ఉమను గట్టిగా మందలించాలని మాటలు తయారు చేసుకుంటున్నాడు. అత్తయ్య లోపలికి వెళ్ళగానే తను నోరు తెరచేలోపలనే ఇంతలో హఠాత్తుగా ఉమే అంది "బావా ఈసారిపోయినా పరీక్షకి మళ్ళీ కట్టొచ్చుగా!"

నిరుత్తరుడైన తనకి నోటివెంబడి మాట రాలేదు. అనాలనుకున్న మాటలు గాలిలో కలిసిపోయినాయి. తప్పుచేసినవాడిలా తలవంచుకుని కూర్చున్నాడు.

"పరీక్ష పోతే పోయింది. దానికి నిన్ను నేనేమీ అనడం లేదుబావా! కానీ-కానీనువ్వు, యం. ఏ. అవాలని నాపట్టుదల అంది."

"ఉమా!" గొంతు జీరబోయి బొంగురుగా మారిపోయింది. పూడిపోతున్న కంఠాన్ని బలవంతాన పెగుల్చుకుంటూ అన్నాడు. "నేను మళ్ళీ కడతాను, నన్ను నమ్ము."

"నిన్ను వేధిస్తున్నానని కానీ, విసిగిస్తున్నానని కాని ఎప్పుడూ అనుకోవుకదూ!" అడగలేక అడిగింది ఉమ.

"ఉహూ, ఆ పన్లురెండు నేనే చేస్తున్నానని నాకు తెలుసు."

"బావా!" ఉమ చేయిజాచి తన చేతిని బలవంతంగా తీసుకుంది. "నువ్వు ఎం. ఏ. అయిపోతే నీకు మంచి ఉద్యోగం దొరుకుతుందని, మనపరిస్థితులు మెరుగు అవుతాయని నా ఆశ. ఊరికే ఆశలు పెంచుకుంటే లాభం లేదని నాకు తెలుసు. కృషి చెయ్యాలి.మనిద్దరం చేశాం. తీరా ఫలితం పొందబోయే సమయంలో ఇలా అయితే ఏమనిపిస్తుందోచెప్పు."

"నాకు తెలుసు ఉమా! నాకు తెలుసు"

నా కళ్ళముందు ఎప్పుడు ఎలాటి దృశ్యాలు కదులుతాయో చెప్పనా?"

చెప్పమన్నట్టు చూశాడు.

"నవ్వావు కదూ!"

"ఉహూ."

"అయితే విను. నువ్వు పెద్దఆఫీసులో మంచి వుద్యోగం చేస్తున్నట్టు, నీకు క్షణం తీరిక లేనట్టు, నువ్వు వుదయం 10 గంటలకల్లా వెళ్ళిపోవాలని బాగా తెల్లవారకముందే లేచి వంటా, అదంతాచేసి, నీ టైమ్ అయే సరికి నీకు ఏలోటూ రాకుండా చూడాలని, మళ్ళీ నువ్వు సాయంత్రం అలిసిపోయి వచ్చే సరికి కాఫీ. టిఫిన్ రెడీచేసి నేను అప్పటికే స్నానం అదీచేసి శుభ్రమైన బట్టలు వేసుకుని, నువ్వు రాగానే యిద్దరం కలిసి ఏ సినిమాకో, షికారుకో వెళ్ళాలని-" చెబ్తూ, చెబ్తూ వుమ హఠాత్తుగా సిగ్గుపడి కళ్ళు వాల్చేసుకుంటూ.

"అలా ఏమిటేమిటో అన్పిస్తుంది. ఆ జీవితం ఎప్పుడెప్పుడా అని ఆత్రుత కలుగుతుంది." అంది.

సంభ్రమాశ్చర్యాలతో తలదించుకున్న వుమ వైపు విచిత్రంగా చూస్తూండిపోయాడతను. సిగ్గుపడగా వుమని చూడడం అదే మొదటిసారి.

సిగ్గుని నిగ్రహించుకుంటూ మళ్ళీ తనే అంది. "ఏ వసతీ లేని ఈ పల్లెటూరి జీవితంతో నాకు మహా విరక్తిగా వుంది. పట్నవాసం అయితే వున్నదాంట్లో అన్నిసుఖాలూ చూడవచ్చుగదా!"

"ఆః డబ్బుండాలి కాని."

"డబ్బు మనకెందుకుండదు? నువ్వు వుద్యోగంచేస్తావుగా!"

యం. ఏ. పాసయినా భవిష్యత్‌ని గురించి యింత కమ్మటి కల తనకి ఏనాడూ ఊహామాత్రంగానయినా రాలేదు. తన భవిష్యత్ మీద ఉమకి శ్రద్ధవుండడంలో ఆశ్చర్యం ఏం కన్పించలేదు. ఉమ నోటివెంబడి వెలువడిన మాటలు కళ్ళముందు అందమైన దృశ్యాల్ని చిత్రిస్తున్నాయి. కానీ యిదంతా తను పరీక్ష అయితేకదా! కానీ-ఉమ కోరుకున్న దానికి పరీక్ష పాస్‌కాకపోయినా అంత ముంచుకుపోయేదేంకాదు. కావాల్సిందల్లా మంచి ఉద్యోగం. ఆర్థికంగా మెరుగుగావుండే ఉద్యోగం దొరికితేచాలు.

లోపలినుంచి అత్తయ్య భోజనానికి రమ్మని పిలవడంతో లేచి వెళ్ళాడు.

ఆ రాత్రి పడుకుంటే చిత్ర విచిత్రమైన దృశ్యాలెన్నెన్నో కలలుగా వచ్చాయి.

మర్నాడు కాఫీ తాగింతర్వాత అత్తయ్య బజారుకెళ్ళి ఏవయినా కూరతీసుకురమ్మని పురమాయించి బిందె తీసుకొని చెరువుకెళ్ళింది.

"దొడ్లోపాదుకి పొట్లకాయవుందమ్మా" అంది ఉమ. వుదయం అంతా కులాసాగానే తిరుగుతోంది వుమ.

"చూశాను. చిన్నది. సరిపోదు." అని వెళ్లిపోయింది అత్తయ్య.

ఉమ యిచ్చిన సంచీ తీసుకుని బజారుకి వచ్చాడు. వూరికి కుడిప్రక్కగా వున్న పెద్ద రావిచెట్టుక్రింద ఉదయం 10 గంటలవరకూ కూరగాయలు అమ్ముతారు.

తొలకరివానలు మొదలైనాయి. రాత్రి వాన పడటంతో వీధులన్నీ అక్కడక్కడా బురదగా వున్నాయి.

వంకాయలు తూయించి సంచిలో వేయించుకుంటుండగా, లైబ్రరీ మెట్లమీదనుంచి గుమాస్తా కేకపెట్టాడు.

"ఇదుగో ! ఏమండోయ్ ! పేపరువచ్చింది. యం. ఏ., రిజల్ట్స్ పడ్డాయి."

చివ్వున తలెత్తి చూశాడు. తన గుండెలు క్షణంసేపు కొట్టుకోడం ఆగిపోయిందా అన్పించింది.

ఈలోపలే లైబ్రరీ గుమస్తా పరుగెత్తుకొచ్చాడు. "చూడండి మీ నంబరు." అంటూ యిచ్చాడు. కాళ్ళక్రింద భూమి కంపిస్తోంది. కళ్ళముందు ఏడుస్తున్న వుమ ముఖం కన్పిస్తోంది, పేపరు తీసుకోకుండా "నారాయణా ! నువ్వే చూడు నంబరు-" అంటూ చెప్పాడు,

"ఏ క్లాసులో చూడను ?"

"థర్డ్ క్లాసులో చూడు."

నారాయణ గబగబా వెతికాడు. "లేదే ! వుండ డి. సెకండ్ క్లాసులో. ఆ. ఆ. ఇదిగో మీ నంబరు. యిక్కడుంది."

"అబద్ధం—" గభాల్న పేపరు లాక్కుని చూసాడు.

నిజంగానే సెకెండ్ క్లాసులో వుంది. కళ్ళు చెదిరినంత పనైంది.

"చూశారా ! సెకెండ్ క్లాసు. కాఫీ పోయించాలి మాకు."

అంటున్నాడు నారాయణ.

అవేవీ తనకి విన్పించలేదు. తను పాసయ్యాడు. పాసయ్యాడు. ఉమకి చెప్పాలి. వడివడిగా నడవటం ప్రారంభించాడు.

"ఇదుగో ! ఏమండోయ్ ! బాబూగారూ ! వంకాయలు మర్చిపోయారు. వద్దా ?" కూరగాయలతను హాస్యంగా వెనకనుండి కేక పెట్టాడు.

ఎడంచేయిఎత్తి వెనక్కు తిరక్కుండానే "మళ్ళీ వస్తా" అన్నాడు. ఇంటికి, బజారుకు పట్టుమని రెండు ఫర్లాంగులు కూడా లేదు. కాని రెండుమైళ్ళలా అన్పించింది. ఎంత త్వర త్వరగా నడిచినా ఇల్లేరాదు.

ఇల్లు కన్పించగానే నడవడం సాధ్యం కాలేదు. ఆ రెండుబారలు పరుగెత్తినాడు.

వీధి గుమ్మంలో పాదం అనీ అనగానే "వుమా !" అని గావుకేక పెట్టాడు.

వుమ పలికేలోపలే "వుమా !" అంటూ వంట యింట్లోకి వచ్చేశాడు.

శుభ్రంగా అలికి ముగ్గుపెట్టినయింట్లో వుమ మధ్యగా కూర్చుని కత్తిపీట ముందు పెట్టుకుని పొట్లకాయని అందంగా చక్రాలుగా తరుగుతోంది.

శ్రీధర్ కేకవిని అర్థంగానిదానిలా తరగటం ఆపి తలెత్తి చూస్తోంది.

"ఉమా ! నేను పాసయాను. సెకెండ్ క్లాసులో. "ఇదుగో." రిజల్ట్స్ వచ్చాయిఅన్న పేపరు చూపించాడు.

"ఏమిటీ ?" వుమ కత్తిపీట ముందునుంచి లేచివస్తూ నమ్మలేనట్టు అడిగింది.

"నిజంగా ! అసలు పోతుంది అనుకుంటే సెకండ్ క్లాస్ లో పాసయ్యాను."

"బావా!" దగ్గరగా వచ్చిన ఉమ హఠాత్తుగా ఆపుకోలేనట్టు నిలబడలేనట్టు అతన్ని పెన వేసుకుని హత్తుకుపోయింది.

"ఉమా ! నేను పాసయ్యాను. కంక

[illegible]కంగా అయింది. లేకపోతే కోటిసార్లు మళ్ళీ మళ్ళీ చెప్పాలనిపిస్తోంది.

ఉమ మాట్లాడలేదు. అలాగే నిలబడిపోయింది.

అప్పుడే భుజాన తడిబట్టలతో, మంచినీళ్ళ బిందెతో వచ్చిన అత్తయ్య తెల్లబోయినట్టు "ఏమిటీ" అంది.

ఉమ మెల్లిగా అయిష్టంగా వదల్లేక వదిలింది. "రిజల్ట్స్ వచ్చాయి. బావపాసయ్యాడమ్మా ! అంది గోడకు ఆనుకొని నిలబడుతూ.

అత్తయ్య కళ్ళలో ఆనందం తళుక్కుమంది.

"అత్తయ్యా !" దేవుడు కరుణించాడన్న మాట, యిద్దరూ సాయంత్రం వెళ్ళి గుళ్ళో కొబ్బరికాయ కొట్టిరండి" అంది.

అత్తయ్య అవతలకి వెళ్ళగానే మళ్ళీ యిద్దరూ ఒకళ్ళముఖాల్లోకి యింకొకళ్ళు చూసుకున్నారు. ఆ చూపుల్లో ఎన్ని భావాలు! ఎంత భాష !

ఉమ ముఖం అపూర్వమైన కాంతితో వెలిగిపోతోంది, ముగ్ధుడై చూస్తూ నిలబడ్డాడు తను. వుమ పెదవులు బిగించి సాగదీస్తూ గదిలోకి వెళ్ళి అద్దం తెచ్చి ఎదురుగుండా పెట్టి "అబ్బాయిగారూ ! ఒక్కసారి ముఖం చూసుకోండి. ఎలా కళకళలాడిపోతోందో. ఉమాదేవి యెప్పుడూ శ్రీధర్‌గారి ముఖం అలా వుండాలని కోరుకుంటుంది." అంది.

అద్దం తీసుకుని ముఖం చూసుకున్నాడు. గడ్డంకాస్తమాసినా నిజంగానేతన ముఖం తనకే కొత్తగా కన్పించింది.

"తమ ముఖం చూసుకోండి ఒక్కసారి." ఎదురుగుండా పెట్టాడు.

వుమ నవ్వుని దాచుకోవాలని, సీరియస్‌గా చూడాలని ప్రయత్నించి విఫలమై ఫక్కున ఒక్కసారిగా నవ్వేసింది.

ఉమ నవ్వు వినగానే తన గుండెలు మీద నుంచి పెద్ద బరువు దింపుకున్నట్టు తేలికపడ్డాయి, "అమ్మా ! ప్రపంచం యిప్పుడుమళ్ళీ మామూలుగా కన్పిస్తోంది." అన్పించింది.

నవ్వుతున్న వుమ అంతలోనే ఆపేసి ఒక్కసారి అందంగా మూతి ముడిచేసుకుంటూ, "ఛ-ఛ ! పెద్ద అద్దం లేకపోవటంవల్ల ఎంత లోటో చూడు. ఇద్దరం ప్రక్క-ప్రక్కన నిలబడి ఒకేసారి చూసుకోటానికి లేకపోయింది." అని వెంటనే చూపుడువేలు సూటిగా పెట్టి చూపిస్తూ, "ఇదిగో బావా ! నువ్వు వుద్యోగంలో చేరగానే మొట్టమొదటి జీతం పెట్టి పె...ద్ద అద్దం కొనాలి తెలుసా ?" అంది.

"జీ హుజూర్" తలవంచి సమ్మతి తెలియజేసాడు తను.

"నీ అంత పొడుగుండాలి అది. ఆ అద్దం రాగానే అందులో నీ ప్రక్కన నిలబడితే ఎలా వుంటానో చూసుకుని బాగున్నాను అనిపిస్తేనే నిన్ను పెళ్ళిచేసుకుంటాను."

అనుకోకుండా కలిగిన ఆనందంతో చాలా రోజుల తర్వాత చిన్ననాటి వాగుడుకాయ అయిన ఉమ కన్పించింది. అవతల అత్తయ్య వింటుందేమోనని సిగ్గుకూడా అన్పించింది.

"అత్తయ్యా ! ఏం చేస్తున్నావు ? కాఫీ వుందా ?" అంటూ మెల్లగా వంటింట్లోకి జారుకున్నాడు.

[సశేషం]